విడీ విడని పెదాల మధ్య వేద పనసలు కాబోలు, మంద్ర స్వరంతో వల్లె వేసుకుంటూ ఆ వ్యక్తి నడుస్తున్నారు. పుర వీధిలో అప్పుడప్పుడే ప్రజలు కార్యవ్యగ్రులై అటూ యిటూ తిరుగాడుతున్నారు. జాము పొద్దెక్కినా. ఎండ వేడిమి తగినంత లేదు మాఘ మాసపు చలిగాలి పాద చారుల శరీరాలను ఝుళ్ మనిపిస్తూనే ఉంది. శివరాత్రికి కాని చలి ''శివ శివా!'' అంటూ పోదు మరి. దూరంగా సస్య క్షేత్రాలలో తెలి మంచు తెరలు యిప్పుడిప్పుడే విచ్చుకుంటున్నాయి. కోట కొన మీద కపోతాలు రహస్య సంకేతాలేవో తెలుపుకుంటున్నట్టుగా కువ కువలాడుతున్నాయి. దారిలో చిన్నా పెద్దా అంతా ఆ వ్యక్తిని చూస్తూ భక్తి భావంతో నమస్కరించి ప్రక్కలకి ఒసరిలుతున్నారు. ఒకరిద్దరు కుశలాలు అడిగి వెళ్తున్నారు. చేతులు జోడించిన వారికి ప్రత్యభివాదం చేస్తూ. పలకరించిన వారికి ప్రత్యుత్తరం యిస్తూ అతను ముందుకి సాగుతున్నారు. నిండైన విగ్రహం. స్పురద్రూపి. వేద వేదాంగ వేదార్థ విత్తముడు. యజ్ఞ విద్యా విశారదుడు ...బ్రహ్మ వర్చస్సుతో చూపరులను ఆకట్టుకునే రూపం. ధవళ వస్త్రధారులై, మెడలో రుద్రాక్ష తావళాలు చేతికి సింహతలాటం నుదుటన విబూది రేకలు... తేజోవంతమయిన ఆ వదనం.... యిప్పుడెందుకో కొంచెం విషణ్ణమై ఉంది. వ్యాకుల చిత్తులై ఉన్నట్టుగా ఆ పరాకు నడక. ఆ కను చివరలలో దృశ్యా దృశ్యంగా నిలిచిన కన్నీటి చుక్కలు లేయెండలో ముత్యాల్లా మెరిసి పోతున్నాయి.

# శివార్పణం

తల పంకిస్తూ, ఏదో ఆలోచిస్తూ, మరేదో స్మరణకి తెచ్చుకుంటూ ఉస్సురంటూ అతను గృహోన్ముఖుడై వడి వడిగా అడుగు లేస్తున్నారు. మనో వేదన ఏదో కలచి వేస్తున్నట్టుగా ఆ తొట్రు పడే అడుగులే చెబుతున్నాయి. అతని మెదడులో ఆలోచనలు సుడులు తిరుగుతున్నాయి.

ఎలాంటి వంశం తమది!..... నిప్పుని నీళ్ళతో కడగే వంశం కాదూ! సత్సంప్రదాయాలకీ, నిత్య కర్మానుష్ఠానాలకీ తన యిల్లు ఆటపట్టు కాదూ! ఇంట నిత్యాగ్ని హోత్రం త్రికాలాలలోనూ త్రి సంధ్యలలో ప్రజ్వరిల్లుతూ ఉండాల్సిందే. సంధ్య వార్చి నమకం, చమకం, దశ సూక్తులూ న్యాసం చేసి పూజాదికాలు నిర్వర్తించి అతిథి సంతర్పణలు అయ్యేక కానీ తను ఔపోసన పట్టడు. భార్య కూడా అంతే.... అన్ని విషయాల లోనూ ఆమె తనకు అనుగామి.... కాని...., కాని... ఒక్క విషయంలో మాత్రం ఆమె ఆలోచన కట్టు తప్పింది. పుత్ర వ్యామోహం వివశురాలిని చేయగా... తనతో సైతం కల్ల మాటలు చెప్పేలా చేసింది! ఆ అసత్య దోషం ఊరికే పోదు.... తమ సంసారాన్ని నిలువునా దహించి వేయక తీరదు...

''శివయ్యా!.... నీ పట్ల ఏం అపచారం చేసామయ్యా! ఎందుకయ్యా మమ్మల్ని యిలా శిక్షిస్తున్నావు? కానక కానక కన్నామే. ఒక్కగా నొక్క కొడుకు... సకల సుగుణాలకీ ఆకర మౌతాడని ఆశ పడి గుణనిధి అని నామకరణం చేసి సంబరపడ్డామే... ఇలా ఎందుకు జరిగిందయ్యా!..... మహ దేవా! నీ భక్తునికీ కఠిన పరీక్ష తగునా చెప్పు?...

పసివాడుగా ఉన్నప్పుడు గుండెల మీద తన లేత పాదాలతో తాడనం చేస్తూ ఉంటే మురిసి పోయాను. పుత్రోత్సాహంతో పరవశించి పోయేను. ముద్దు ముద్దు మాటలతో శివేతర శుష్క సంభాషణలు చేస్తూ ఉంటే పసితనం కదా అని పరాకు పడ్డాను. ఎంత చెప్పినా వినదే!.... తల్లి వెనకేసు కొచ్చేది!.... ''స్వామి భక్తిలో మిమ్మల్ని మించి పోతాడు!..... చూస్తూ ఉండండి....'' అనేది. అవును కాబోలు అనుకునే వాడు తను.

ఆ ఉదాసీన భావమే యింత వరకూ తెచ్చింది. తను వాడి చుట్టూ అల్లుకున్న కలల ప్రపంచం బ్రద్దలయింది.

తల్లి అమాయికంగానో అజ్ఞానం తోనో చేసిన అతి గారాబం వాడిని ఎంత వరకూ చెడ గొట్టాలో అంత వరకూ చెడగొట్టింది. కుల భ్రష్టుడై పోయేడు. వాడు తిరగని తిరుగుళ్ళు లేవు. చేయని చెడు సావాసం లేదు. వాడికి అలవడని దుర్వ్యసనం లేదు. షట్ శాస్త్రాలూ అభ్యసింప చేసి, విద్వన్మణిగా వాడిని తీర్చి దిద్దాలని ఎంతగా తల పోసాడో!.... ఈ కాంపిల్య పురంలోని విప్రోత్తముల సరసన సగర్వంగా నిలిపి. ''మన యజ్ఞదత్తుని కొడుక్కాదూ. వీడు! ఎంత వాడయ్యాడు!..... వంశోన్నతికి వన్నె తెచ్చే యిలాంటి పుత్ర రత్నం ఒక్కడుంటే చాలదూ!....'' అని అందరూ అబ్బుర పడేలా కొడుకుని పెంచాలనుకున్నాడు. అన్నీ వమ్మై పోయినై. ఆశా సౌధం కూలి పోయింది. దీనికంతకూ కారణం తన భార్య కాదూ! ఆమె చేసి అతి గారాబం కాదూ! గృహ కార్యాంతర వ్యగ్రుడై తను కొడుకు బాగోగులు, వర్తనం గురించి అలక్ష్యం చూపిన మాట నిజమే. అది కూడా కారణమేనేమో... తల్లిదండ్రులు సరిగా పట్టించుకోక పోతే లోకంలో పిల్లలు సక్రమంగా ఎలా పెరుగుతారు!... సరైన దోహద క్రియ లేని తరుగుల్మాదులు ఎలా ఎదుగుతాయి?

అతిన క్రోధావేశం ఎటు తిరిగీ మళ్ళా భార్య మీదికే మళ్ళింది.. తను సరే. లక్ష పనులు. కోటి వ్యాపకాలు సకాలంలో ఉపనీతునిగా చేసి, ఆచార్యుల వద్ద చదువ బెట్టాడు. తండ్రిగా తన ధర్మం తాను నెరవేర్చాడు. తల్లి చూసుకోవద్దూ!.... వాడెలా ఉన్నాడో. ఏ తిరుగుళ్ళు తిరుగుతున్నాడో గమనించ వద్దూ?... పోనీ? తను అడిగి నప్పుడయినా తనతో నిజాలు చెప్పొద్దూ!....నిజాలు దాట వేయకుండా వాడి గురించి ఎప్పుడయినా ఒక్క ముక్క చెప్పిందీ?...

''ఏడే. మన సుపుత్రుడు?... స్నానం చేసాడా? సంధ్య వార్చాడా!... అగ్నిహోత్రం నిర్వర్తించాడా!...'' అని తను అడిగి నప్పుడల్లా ఏం చెప్పేది!.... ''ఓ!... అన్నీ అయ్యేయండీ!... స్నానం చేసాడు. సంధ్య వార్చేడు. అగ్ని హోత్రం నిర్విఘ్నంగా ఒనరించాడు.... ఏదీ. యిదిగో. ఇప్పుడే చదువు కోడానికి కాబోలు వెళ్ళాడు...'' అంటూ వాడి దుర్వృత్తులు వెల్లడి కాకుండా మభ్య పరిచేది. పుత్ర వ్యామోహం సహజమే కానీ. మరీ యింత చేటు గానా! ఆ తల్లి అంతగా వెనకేసుకురాబట్టే కదా. వాడిలా తయారయేడు!

ద్యూత క్రీడా రతుడు. కితవుల సాహసం చేసి. వేళా పాళా లేకుండా తిరుగుతూ ఉంటాడు. బ్రాహ్మణులని పరిహాసం చేయడానికి వెనుకాడడు. అనుష్ఠాన కర్మల నెప్పుడో అటకెక్కించేసేడు... గీత వాయిద్యాలలో మునిగి తేలుతూ ఉంటాడు. వేద మంత్రోచ్చాటన విని పించాల్సిన నోట దుర్భాషలు పలుకుతూ ఉంటాయి. నాస్తికులతో చెలిమి. నటులను మన్నించడం. విటులని హర్షించడం. పీత మర్దులకు పెద్దరికాన్ని యివ్వడం. కౌలటేయులని గారవించడం.. హవ్వ!.... కులాచార భ్రష్టుడై పోయేడు. తల్లి వంటి మీద నగలన్నీ వాడి జూద క్రీడకే సరి!...

కుమారుని పతనం తలపున కొచ్చి, తల్లడిల్లి పోయేడతను. క్రోధావేశంతో అతని వదనం అరుణిమ దాల్చింది. ముకుపుటాలు అదురుతున్నాయి. మేను చెమరుస్తోంది.

వాడి నిర్వాకం గురించి యిప్పుడే తెలిసింది తనకు!.... వాడి జతగాడి నోట ఆ విషయాలన్నీ మొదటి సారిగా విని మ్రాన్పడి పోయేడు తను.

తన మానాన తను దారమ్మట వస్తూ ఉంటే అప్పుడు కనిపించాడు వాడు. కొడుకు జతగాడు!

అప్పుడు కనిపించింది ఆ జూదరిచేతి వ్రేలికి తొడిగి కొని ఉన్న నవరత్నాంగుళీయకం!



అది....

అది. తనది కాదూ!.... తనకత్యంత ప్రేమ పాత్రమైన ఆభరణ విశేషం కాదూ!.... అర్ధాంగి మురిపెంగా అడిగితే ఆమెకి యిచ్చాడు తను... అడిగిన వేళ అలాంటిది. మరి!.... అది వీడి చేతి కెలా వచ్చింది?! ఆశ్చర్యపోయేడు. ఆగ్రహోదగ్రుడయ్యేడు. వాడిని ఆపి. నిలేసాడు, వాడి చేయి పట్టుకుని గుంజుతూ "ఈ ఉంగరం నీకెలా వచ్చిందిరా!.... నిజం చెప్పు!.... లేదంటే ప్రభువు సన్నిధిలో దోషిగా నిలబెట్టి దండించ గలను సుమా!...." అని గద్దిస్తూ అడిగేడు.

వాడు రవ్వంతయినా భయపడ్డట్టు లేదు. ఉన్నది ఉన్నట్టు చెప్పేసాడు. ఆ ఉంగరం గుణ నిధి జూదంలో ఒడ్డి ఓడిపోయి తన కిచ్చేడని చెప్పాడు. ఇదే కాదు. యింకా చాలా పోగొట్టుకున్నాడని కూడ చెప్పేడు.. బంగారు భృంగారు కర్కరీకలాచికులు, తళియలు, పళ్ళెరాలు తామ్ర పాత్రం లార కూట ఘటం.... ఒకటేమిటి. చాలా ఒడ్డి ఓటమి పాలయ్యేడని తమకి కుదువ పెట్టేడనీ చెప్పాడు. అంతటితో ఆగేడా?... "అక్ష ధూర్తులలో నీ అనుగు కుమారుడు దొర సుమీ! అంతటి వాడు వేరొకడు లేడు!...." అని కూడ పొగిడేడు.

వాడి మాటలు శరాఘాతాల్లా తగిలేయి అతని కర్ణ పుటాలకి. లజ్జాక్రోధాలు ముప్పిరిగొన్నాయి. ముఖం గంటు పెట్టుకుని. వడి వడిగా యింటి దారి పట్టాడు.

***

ఇంటికి వస్తూనే భార్యని కేకేసి. గద్దించి అడిగేడు.. "సోమి దేవమ్మా. ఏం చేస్తున్నావ్? యిలారా!... నీ కొడుకేడీ? ఎక్కడికెళ్తే నాకేం కానీ ఆ నడుమ సల్లాపాల వేళ నా అంగుళీయకాన్ని అడిగి తీసుకున్నావు కదూ!.... అదేదీ. దానిని ధరించి పావకునికి హవిర్దానం చెయ్యాలి. తెచ్చివ్వు!...." అనడిగేడు.

అనుకున్నంతా అయింది. సోమిదమ్మ బిత్తరపోయింది. ఇన్నాళ్ళూ కొడుకు చేష్టలు భర్తకి తెలియకుండా ఎలాగో ఒకలాగ నెట్టు కొస్తోంది. కొడుకుని


వెనకేసు కొస్తోంది తను!.... ఇప్పుడు భర్తకి నిజం తెలిసిపోయినట్టుంది.. ఆ ఉంగరం తెచ్చిమ్మని గొంతు మీద కూర్చున్నాడు!.... ఇంకెక్కడి ఉంగరం! అదే కాదు.. దానితో పాటు చాలా విలువైన వస్తువు లెన్నో తన గారాల కొడుకు పాలుచేసింది... ఉంగరం తెచ్చిమ్మంటే ఎక్కడి నుండి తేవడం!.... ఏమీ పాలుపోవడం లేదామెకు. క్షణ కాలం యోచించి తెప్పరిల్లాక అప్పటికా గండం గట్టెక్కాలని తలచి అందంగా అబద్ధం ఆడబోయింది.

"లేడికి లేచిందే పరుగనీ.... ముందు మీరు మధ్యాహ్నిక సంధ్య వార్చుండి. అగ్ని కార్యం తీర్చండి. శివయ్యని పూజించండి. పంచ మహా యజ్ఞాలూ నిర్వర్తించండి... అతిథుల కోసం వండి వార్చిన ఓగిరాలు - పక్వాన్నాలూ. శాక పాకాలూ- చల్లారి పోకుండా వారికి సమర్పించండి.. చల్లారి పోతే రుచి చెడి పోదూ!.... మీ ఉంగరాని కొచ్చిన ముప్పేమీ లేదు. మందసంలో బరిణెలో భద్రంగా దాచి ఉంచాను. మీ భోజనాదులయేక తెచ్చి యిస్తాను లెండి...." అని సర్ది చెప్పబోయింది.

వెర్రి కోపం ముంచు కొచ్చింది సోమయాజికి. భార్య యింకా తనని మభ్య పెట్టాలని ప్రయత్నిస్తూ ఉండడం అతను జీర్ణించుకోలేక పోయేడు. నిష్ఠుర వాక్యాలతో భార్యని మందలించాడు. కొడుకు దుశ్చర్యలు తనకి యింత కాలం చెప్పకుండా కప్పి పుచ్చి తనని వంచించిందని తిట్టిపోసాడు. ఆమె మాటలు నమ్మి వాడిని తను భ్రష్టు పట్టించానని ఖేదపడ్డాడు. ఇంట ఉండాల్సిన అపురూప ఆభరణ విశేషాలు కనుమరుగు కావడానికి ఆమే కారణమని క్రోధంతో రగిలి పోయాడు. కొంపని నువ్వూ. నీ కొడుకూ కలిసి తుద ముట్టుగా నాశనం చేసారు కదా అని వగచేడు.

అతని కోపం తారాస్థాయినందుకుంది. "కుపుత్రత్వం కంటె అపుత్రత్వం మేలు... వాడు నాపాలిట చచ్చేడనుకొని యిన్ని నీళ్ళు వదిలేస్తాను....చాలు! చాలు!... ఆ కుల పాంసనుడిని త్యజించి కులాన్ని కాపాడుతాను...." అంటూ చిందు లేసాడు.

నోటమాట రాక ఆమె స్తబ్ధురాలయి పోయింది. కొడుక్కి ఎన్ని పర్యాయాలు తను నీతులు చెప్ప లేదు?



"మీ తండ్రి కోపగాడు సుమీ!.... నేను నిన్ను వెనకేసుకొస్తున్న విషయం తెలిస్తే నా ఉసురు తీస్తాడు తెలుసా!.... ఈ చెటు పనుల వలన కులానికి కళంకం తేవడమే కాక. నలుగురిలోనూ నగుబాటే కదరా!...." అవి. ఎన్ని సార్లు వాడిని తను హెచ్చరించ లేదు!... వాడు వింటేనా!... ఆమె అచేతనురాలై అలా ఉండి పోయింది.

***

తన బండారం బయట పడి తండ్రి కోపానలంతో రగిలి పోయిన వైనం గుణనిధి చెవినిపడింది. మరి. యింటికి రావడానికి వాడికి ధైర్యం లేక పోయింది. అక్కడా యిక్కడా తిరగ సాగేడు.

దగ్గరున్న ద్రవ్యం హరించుకు పోయేక వాడికి బతుకు భయం పట్టుకుంది. చేత చిల్లి గవ్వ లేదు! ధనం నిప్పచ్చర మయింది. చదువా హుళక్కి - భిక్షాటనకి మనసు వొప్పదు...

పేరాకలి దహించి వేస్తోంది గుణనిధికి. తిండి కోసం అవురావురుమంటూ పిచ్చి వాడిలా తిరుగుతున్నాడు. తిండి దొరికే మార్గం కనిపించడంలేదు.

రాత్రయింది.

ఆ రోజు శివరాత్రి!.... ఆ సంగతి వాడెరుగనే ఎరుగడు!.... వాడి ధ్యాసంతా తిండి మీదే.

నగర బాహ్య ప్రదేశంలో ఒక శివాలయం. శివపూజలు ఘనంగా జరుగుతున్నాయి. ధూపదీప నైవేద్యాలు బాగానే సమర్పిస్తున్నట్టున్నారు!.... సొష్టవమైన శాక పాక రసావళులు భక్ష్య భోజ్య లేహ్య పానకాదులు సమృద్ధిగా సమర్పిస్తుట్టుగానే ఉన్నారు.

ఆ కమ్మని సువాసనలు గుణనిధి నాసికా పుటాలని ఆలవోకగా తాకాయి. చవులూరిస్తున్నాయి. కాళ్ళు అప్రయత్నంగా అటు వేపు సాగేయి. లోపల "హర హర! మహా దేవ!... శంభో శంకర!..." అనే మాటలు హర్షాతిరేకంతో మిన్ను ముట్టేలా వినిపిస్తున్నాయి.

గుణ నిధి మెల్లగా అక్కడికి సమీపించాడు. ఆ పూజా విధులు ఎప్పటికి ముగుస్తాయో తెలియదు... నైవేద్యం ఎప్పుడు పెడతారో తెలియదు... వాళ్ళు అక్కడి నుండి నిష్క్రమించాక కానీ అవి తనకు ఉపలభ్యం కావు. నిస్సహాయంగా పులుకు పులుకూ గుడిలోకి చూస్తూ కాలం గడపసాగేడు. గుణనిధి. ఆ రాత్రి తనకి తెలియకుండానే జాగరం చేసాడతను.

***

గుణ నిధి నిరీక్షణ ఫలించింది. అక్కడ కాస్త సద్దు మణిగింది. నెమ్మదిగా లేచి నించున్నాడు గుణనిధి. దొంగలా ఆలయంలోకి ప్రవేశించాడు. పై వలువ నడుం మీద బిగించి కట్టుకున్నాడు. తలుపులు చప్పుడు కానీయకుండా లాఘవంగా గుడి లోపలకి జొరబడ్డాడు. అక్కడంతా చీకటి. కన్ను పొడుచుకున్నా కనబడ్డం లేదు. గర్భ మంటపంలో అంత వరకూ జాజ్వల్యమానంగా వెలిగిన దీపకళిక అప్పుడు కొంత దశ చెడింది కాబోలు!... ఎక్కడేం ఉందో తెలీడం లేదు. భక్ష్య విశేషాల పళ్ళెరం కనిపించడం లేదు. అంతా తడుముకోవాల్సి వస్తోంది. ఇక లాభం లేదనుకుని. కట్టుకున్న పంచె కొసని చించి వత్తిగా చేసి ప్రమిదలో ఉంచి తైలంలో ముంచి దీపం మళ్ళీ వెలిగేలా చేసాడు. ఆ వెల్తురులో కనిపించిన అన్న పాత్రను చూసి అతని ఆనందానికి అవధులు లేక పోయింది. అందుకున్నాడు. ఆలయం వెలుపల సురక్షిత ప్రదేశంలో భుజిద్దామని నిర్ణయించుకున్నాడు. పాత్రని పదిలంగా పట్టుకుని. మెల్లగా అడుగులో అడుగు వేస్తూ వెనుతిరిగాడు.

అప్పుడు జరిగిందది!....

ఎంత చాకచక్యంగా అన్న పాత్రను ఎత్తుకొద్దామనుకున్నా, వాడి కాలు అక్కడ పరున్న ఓ భక్తుడికి తగలడం వాడు... దొంగ! దొంగ!! అని అరుస్తూ లేవడం త్రుటి కాలంలో జరిగి పోయేయి. అంతే!.... వాడి కేకలకి అంతా లేచి గుణనిధిని చుట్టుముట్టారు. భయంతో పరుగు లంకించుకున్నాడు గుణనిధి. తలారులు వెంబడించి. నిశిత బాణాలు వాడి మీద వెల్లువలా కురిపించారు. ఆ శరాఘాతికి తట్టుకోలేక నేల మీదకి కుప్పలా కూలి పోయాడు గుణనిధి. ఆ శైవాలయ ప్రాంగణం లోనే తుది ఊపిరులొదిలాడు. హంస ఎగిరి పోయింది.

***

పుత్ర శోకంతో ఆ తల్లి తల్లడిల్లి పోతోంది.

వేద విదుడైన యజ్ఞ దత్తుడు కూడ కుమారుని మరణ వార్త విని కొంత సేపు కలత చెందినా తమ బిడ్డ శివరాత్రి పర్వదినాన, శివ సాయుజ్యాన్ని పొందిన వైనం ఆకళింపు చేసుకున్నాడు. అతి సూక్ష్మమయిన శివ ధర్మం ఎఱిగిన వాడతను....

తిండి దొరకక పోవడం వల్లనే కావచ్చు.... కొడుకు శివరాత్రి నాడు ఓరంత ప్రొద్దు ఉపవాసం చేసాడు...

తిండి దొంగిలిద్దామనుకునే వచ్చి... వేకువ వేళ వరకూ కనురెప్ప వేయకుండా జాగరం చేసాడు...

చీకటిలో తడుముకోడానికి యిబ్బంది పడడం వల్లనే కావచ్చు... శివ సన్నిధానంలో దీపం వెలిగించాడు!....

యధాలాపంగానే కావచ్చు- ఆ పర్వ దినాన జరిగిన శివ పూజను కనులారా తిలకించి ధన్యుడయేడు...

విధివశాత్తు ప్రాణాలు కోల్పోయినా ఆ చంద్రశేఖరుని సన్నిధానం లోనే అతను తనువు చాలించేడు...

శివసాయుజ్యం పొందడానికి యింత కన్నా ఏం కావాలి!

"నా ముద్దు కుఱ్ఱా ఎంత భాగ్యశాలివయ్యా నువ్వు!...." కొడుకుని తలుచుకుంటూ అనుకున్నాడు యజ్ఞదత్తుడు.

అలా అనుకుంటూనే చేతులెత్తి. "హర! హర! మహాదేవ!... శంభో శంకర!... భక్తవశంకర!..." అంటూ భక్తి తన్మయత్వంతో గళమెత్తి శివ నామ స్తోత్రం చేసాడు.

సోమి దేవమ్మకి అతని వైనం అర్ధమయిందో, లేదో! తనూ రెప్పలార్పి చేతులు జోడించి శివ ధ్యానం చేయ సాగింది....

*

---

మూల కథ: శ్రీనాథ విరచిత కాశీ ఖండంలోని కుబేర వృత్తాంతం

కథానువర్తనం: పంతుల జోగారావు

సెల్: 94901 39622